
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
కృష్ణా
జిల్లా వార్తలు
గురువారం 31 అక్టోబరు 2024





నగర వరం


కొత్తూరు తాడేపల్లిలోని నగర వనం

- రా..రమ్మంటూ ప్రకృతి ప్రేమికులను పిలుస్తోన్న 'నగర వనం'
- వర్షాలకు పచ్చదనం పరచుకున్న ప్రకృతి సౌందర్యం
- ఆకర్షిస్తున్న ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, చిన్నారుల క్రీడా మైదానం
- క్యూ కడుతున్న విజయవాడ నగర వాసులు



ప్రకృతి ప్రేమికులకు వరం విజయవాడ శివారు కొత్తూరు తాడేపల్లిలోని నగర వనం. తొలి మంచు తెరల మాటున పరచుకున్న పచ్చని అందాలు పర్యాటకుల మనస్సు దోచుకుంటున్నాయి. స్వచ్ఛమైన ఇక్కడి వాతావరణం శారీరక, మానసిక ఒత్తిడుల నుంచి ఉపశమనం కల్పిస్తోంది. భవానీ ద్వీపం, కొండపల్లి ఖిల్లా, మూలపాడు బటర్ ఫ్లై పార్క్ తర్వాత ప్రకృతి రమణీయ ప్రదేశంగా గుర్తింపు పొందింది. చిన్నారుల క్రీడా మైదానం, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్ తదితర సౌకర్యాలు చిన్నారులు, వాకర్లు, ట్రెక్కర్లను ఆకర్షిస్తున్నాయి. ప్రకృతి ప్రసాదిత సహజ నగర వనం మరింత అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

10

ఆర్టీసీలో పదోన్నతుల రగడ



సంస్థలో వేల సంఖ్యలో ఖాళీగా పోస్టులు

- అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు, పదోన్నతులు
- ఉద్యోగులకు మాత్రం ప్రభుత్వ అనుమతి, సాంకేతిక సాకులతో నిలుపుదల
- అర్హత పరీక్షలు ఉత్తీర్ణులై ఏళ్లు గడిచినా ఇవ్వని పోస్టింగ్
- ఉన్నతాధికారుల ద్వంద్వ వైఖరిపై ఉద్యోగుల ఆగ్రహం

ఆర్టీసీలో అధికారులు, ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ఉన్నతాధికారులు వ్యవహార శైలి అనేక విమర్శలకు దారితీస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టుల్లో అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు, పదోన్నతులు ఇస్తున్న వీరు అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులై పదోన్నతి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఉద్యోగులకు మాత్రం పదోన్నతి కల్పించడానికి అనేక సాకులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల ద్వంద వైఖరిపై ఉద్యోగుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీలో పదోన్నతుల రగడ చర్చనీయాంశంగా మారింది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో పదోన్నతుల రగడ నడుస్తోంది. అధికారులకో న్యాయం.. ఉద్యోగులకో న్యాయం అన్నట్టుగా ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సంస్థలో డిప్యూటీ మెకానిక్‌లు, అసిస్టెంట్ మేనేజర్లు, ఏడీ, పీడీ, ఓపీడీ, ఎంఈడీ, ఎస్పీడీ, మ్యాట్ తదితర విభాగాల్లో వందలాది మందికి చాలా ఏళ్లుగా పదోన్నతులు ఇవ్వడం లేదు. ఈ విభాగాలలో పనిచేసే వారికి పదోన్నతులు ఇవ్వటానికి ఉన్నతాధికారులు అనేక సాంకేతిక కారణాలు చూపిస్తున్నారని బాధిత ఉద్యోగులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఖాళీల భర్తీ పేరుతో సంస్థలో పనిచేసే చాలా మంది అధికారులను తాత్కాలిక ఇన్‌చార్జిలుగా నియమించడంతో పాటు పదోన్నతులను కల్పించారు. అధికారుల పదోన్నతుల విషయంలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు రాలేదని, ఉద్యోగుల విషయంలో ఎందుకు సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. సంస్థలో పదోన్నతులను అందుకునేందుకు అవసరమైన పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన వారు చాలా మంది ఉన్నారు. సీనియారిటీ ప్రకారం పదోన్నతులకు అర్హులైన వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరంతా కూడా తమకు పదోన్నతులు వస్తాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా పదోన్నతులు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇప్పుడు పదోన్నతులు రాకపోతే తీరని అన్యాయం జరుగుతుందని లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ అనుమతి, సాంకేతిక కారణాల సాకు..

ప్రభుత్వ రంగ సంస్థ నుంచి ప్రభుత్వశాఖగా మారిన క్రమంలో ఆయా విభాగాల ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని, కొన్ని సాంకేతిక కారణాలు కూడా ఉన్నాయని సాకు చెబుతూ ఉన్నతాధికారులు తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి కావాలంటే ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదించాలి. అలాంటి ప్రయత్నం ఉన్నతాధికారుల నుంచి జరగటం లేదు. దీంతో బాధిత ఉద్యోగులలో తీవ్ర నిరాశ, అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చే వరకు తాత్కాలిక ఇన్‌చార్జిలుగా అయినా బాధ్యతలు అప్పగిస్తే.. ఆయా పోస్టులలో పని విధానాన్ని వీరు తెలుసుకోవటంతో పాటు, నైపుణ్యం, అనుభవం కూడా పెంచుకునే అవకాశం ఉంటుంది. దీనిపై ఏపీపీటీడీ గుర్తింపు సంఘం ఈయూ తరఫున రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదరరావు, నరసయ్యలు ఆర్టీసీ ఎండీకి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖపై ఉన్నతాధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే!

ఇది అన్యాయం

ఆర్టీసీలోని ఖాళీల్లో అధికారులకు పదోన్నతులు ఇచ్చిన విధంగానే ఉద్యోగులకు కూడా పదోన్నతులు ఇవ్వాలి. కేటగిరీల వారీగా మొత్తం మూడు వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భర్తీ చేయకపోవడంతో పనిభారంతో అల్లాడిపోతున్నారు. పదోన్నతుల విషయంలో అధికారులు, ఉద్యోగులను వేర్వేరుగా చూడటం తగదు.

- పలిశెట్టి దామోదరరావు,
ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ)లో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ప్రాజెక్టు డైరెక్టర్ పదవీ విరమణ చేసి ఆరు నెలలు గడిచినా ఇంత వరకు రెగ్యులర్ పీడీని నియమించలేదు. ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన ఏపీఎంలు, డీపీఎంలు బాధ్యతలు అప్పగించకపోవడంతో ఖాళీగా ఉంటున్నారు. పర్యవేక్షణ కొరవడి జిల్లాలో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

డీఆర్‌డీఏలో పాలన గాడిన పడేదెప్పుడు?


డీఆర్‌డీఏ కార్యాలయం

ఆరు నెలల నుంచి ఇన్‌చార్జి పీడీనే దిక్కు

- బదిలీపై వచ్చిన ఏపీఎంలు, డీపీఎంలకు అప్పగించని బాధ్యతలు
- హెచ్‌ఆర్‌గా నియమితులైన ఉద్యోగి పరిస్థితి అంతే..

పడిపోతున్న జిల్లా ర్యాంకింగ్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ)లో పరిపాలన గాడిన పడటంలేదు. ఆరు నెలల క్రితం డీఆర్‌డీఏ పీడీ పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో రెగ్యులర్‌గా ఎవరినీ నియమించలేదు. గతంలో జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేసిన నాగేశ్వరనాయక్‌ను డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా నియమించారు. అప్పట్లో ఎన్నికల సమయం కావడంతో ఆయన అంతగా ఈ శాఖను పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన జిల్లా అధికారుల బదిలీల్లోనూ డీఆర్‌డీఏ పీడీగా ఎవ్వరినీ నియమించలేదు. ప్రస్తుత డీపీవో అరుణ డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా వ్యవహరిస్తున్నారు. అత్యవసరమైన ఫైళ్ల మినహా పరిపాలనా వ్యవహారాల్లో ఆమె అంతగా జోక్యం చేసుకోవడం లేదు.

ఖాళీగా బదిలీపై వచ్చిన ఏపీఎంలు, డీపీఎంలు

డీఆర్‌డీఏలో గత నెల 22వతేదీ నాటికి బదిలీల ప్రక్రియ పూర్తయింది. జిల్లాలో ఒకే మండలంలో ఐదేళ్లకు పైబడి పనిచేస్తున్న ఏపీఎం, డీపీఎంలను వివిధ మండలాలకు బదిలీ చేశారు. ఈ బదిలీల ప్రక్రియలోనూ అనేక ఆరోపణలు వచ్చాయి. అయినా బదిలీల ప్రక్రియను మమ అనిపించారు. బదిలీల్లో భాగంగా ఇతర జిల్లాల నుంచి, సెర్ప్ కార్యాలయం నుంచి ఆరుగురు ఏపీఎంలు, ముగ్గురు డీపీఎంలు జిల్లాకు బదిలీపై వచ్చారు. వీరు డీఆర్‌డీఏ కార్యాలయంలో రిపోర్టు చేశారు. అయితే ఏపీఎంలకు ఇంకా మండలాలను కేటాయించలేదు. డీపీఎంలకు బాధ్యతలను అప్పగించలేదు. ప్రస్తుతం వారు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియని స్థితి నెలకొంది. వారికి జీతాలు మాత్రం చేసి పనిలేకుండా కూర్చోబెట్టారు. నూతన పీడీ వచ్చాక ఈ వ్యవహారాలన్నీ చూసుకుంటారనే కారణం చూపి బదిలీపై వచ్చిన ఉద్యోగులకు మండలాలను కేటాయించకుండా మిన్నకుండిపోయారు.

చిట్ట చివరిస్థానాల్లోకి జిల్లా

మండలాల్లో పనిచేసే ఏపీఎంలు డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పించడం, క్షేత్రస్థాయిలో రికార్డుల నిర్వహణ, స్త్రీనిధి రుణాల మంజూరు, రుణాల రికవరీ, ఎక్కడైనా వివాదాలు ఏర్పడితే వాటిపై విచారణ చేసి సరిచేయడం, వివిధ రకాల సర్వేలు, తదితర పనులను నిత్యం పర్యవేక్షణ చేస్తూ ఉండాలి. ఆరు నెలలుగా జిల్లా అధికారి లేకపోవడంతో పరిపాలనా పరమైన వ్యవహారాలను పట్టించుకునేవారే లేకుండా పోయారు. డీఆర్‌డీఏలో పరిపాలనాపరమైన నివేదికలకు సంబంధించి కృష్ణాజిల్లా రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 14 లేదా 15వ స్థానాల్లో గతంలో కొనసాగుతూ ఉండేది. గత కొన్ని నెలలుగా డీఆర్‌డీఏ పనితీరులో 23, 24 స్థానాలకు దిగజారిపోయింది.

హెచ్‌ఆర్ పోస్టులో ఉద్యోగిని నియమించినా!

ఇటీవల జరిగిన బదిలీల్లో డీఆర్‌డీఏ కార్యాలయంలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్న ఉద్యోగిని మచిలీపట్నం, మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి సర్కిల్ కో-ఆర్డినేటర్‌గా బదిలీ చేశారు. ఆయనకు డీఆర్‌డీఏ కార్యాలయంలో ఫైనాన్స్ విభాగం బాధ్యతలను అదనంగా అప్పగించారు. హెచ్‌ఆర్‌గా వేరే ఉద్యోగిని నియమించారు. కానీ హెచ్‌ఆర్ బాధ్యతలను సదరు ఉద్యోగికి అప్పగించకపోవడంతో ఆయన ఖాళీగానే కార్యాలయంలో ఉంటున్నారు. ఘంటసాల ఏపీఎంను ఉయ్యూరు మండలానికి బదిలీ చేశారు. ఘంటసాల మండలానికి వేరెవరినీ నియమించకుండా తెరవెనుక చక్రం తిప్పారు. ఉయ్యూరులో పనిచేస్తున్న ఏపీఎం ఘంటసాల మండలాన్ని తనగుప్పిట్లో పెట్టుకుని తెరవెనుక కథ నడిపిస్తున్నాడు.

బాణసంచా వ్యాపారుల ఆశలపై వాన



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బాణసంచా వ్యాపారులను వర్షం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. పండుగకు ముందు రోజున రికార్డు స్థాయిలో బాణసంచా వ్యాపారం జరుగుతుందని ఆశించారు. అయితే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్యాపారం బాగానే సాగినా కీలకమైన సాయంత్రం వేళ వర్షం కారణంగా ఇబ్బంది ఎదురైంది. రాత్రి మళ్లీ వ్యాపారం యథావిధిగా సాగింది. పండుగ రోజు వ్యాపారంపైనే వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు.

నాటు మందు మిస్‌ఫైర్

ముగ్గురికి తీవ్ర గాయాలు

- కృత్తివెన్ను మండలం నిడమర్రులో ఘటన


తీవ్రంగా గాయపడిన శివ


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

కృత్తివెన్ను, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నాటు మందు మిస్‌ఫైర్ అవ్వడంతో ముగ్గురు గాయపడిన ఘటన కృత్తివెన్ను మండలం నిడమర్రు దళితవాడలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... నెల్లూరు పట్టణానికి చెందిన శివ పిట్టలు కొట్టుకుంటూ జీవిస్తున్నాడు. చెరువుల వద్ద పిట్టలు కొట్టేందుకు నిడమర్రు వచ్చాడు. గ్రామానికి చెందిన కర్రి నాగమల్లేశ్వరరావు సాయంతో నడకుదిటి వెంకన్న ఇంటి వద్ద పిట్టలను కాల్చే మందును సిద్ధం చేసేపనిలో నిమగ్నమయ్యారు. పక్క ఇంట్లో ఉండే 9వ తరగతి విద్యార్థి కర్రి తేజ వీరు చేసే పని చూసేందుకు వెళ్లాడు. ఇంతలో వర్షం పడటంతో హడావుడిగా మందును ఇంట్లోకి తీసుకెళ్తుండగా, ప్రమాదవశాత్తు మందు ఉన్న గిన్నె రాయిపై పడి, మిస్ ఫైర్ అయ్యింది. దీంతో శివ, నాగమల్లేశ్వరరావు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. తేజ కూడా గాయపడ్డాడు. వీరిని మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శివ, నాగమల్లేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ అబ్దుల్ సుభాన్, తహసీల్దార్ సోమేశ్వరరావు, ఎస్సై పైడిబాబు పరిశీలించారు. క్లూస్ టీమ్‌లు పరిశీలించి వివరాలను సేకరించాయి.

నాటు బాంబు!

జరిగిన ప్రమాదంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నాటు బాంబుల తయారీలో అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తెల్లారితే దీపావళి.. పందుల వేట కోసం రహస్యంగా నాటు బాంబులు తయారీ జరుగుతున్నట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. తయారు చేసిన మందులను ఇంట్లో భద్రపరిచే క్రమంలో ప్రమాదం జరిగినట్లు వస్తున్న పుకార్లకు, సంఘటనలో సంభవించిన తీవ్రత, క్షతగాత్రులకు అయిన గాయాలు మరింత బలం చేకూర్చుతున్నాయి. అయితే పోలీసులు మాత్రం దీపావళి మందులు తరలించే క్రమంలో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.



గన్నవరం నియోజకవర్గ ప్రజానీకానికి దీపావళి శుభాకాంక్షలు

జనం మెచ్చిన నాయకుడు... నిత్య ప్రజా సేవకుడు....

125 రోజుల పాలనలో..
యార్లగడ్డ తనదైన ముద్ర



- గన్నవరంలో సూపర్ సిక్స్ హామీలు అమలు దిశగా అడుగులు
- సిఎం చంద్రబాబు ఇచ్చిన బాధ్యత ను సక్రమంగా నిర్వర్తించి.. వరద బాధితులు ఆహారానికి ఇబ్బంది పడకుండా మూడు పూట్లా ఆహారాన్ని అందించిన నాయకుడు
- పుచ్చలపల్లి సుందరయ్య, కాకాని వెంకటరత్నం లాంటి మహానుభావులు ప్రాతినిధ్యం వహించిన గన్నవరం నియోజకవర్గానికి యార్లగడ్డ రాకతో మళ్లీ పునర్వైభవం.
- బూతు రాజకీయాలు, భూసెటిల్‌మెంట్స్, భూఆక్రమణలు, అక్రమ మైనింగ్, అక్రమ కేసులు, కబ్జాలకు స్వస్తి.
- ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలు.. హాజరైన కలెక్టర్.. 5వేలకుపైగా సమస్యలకు పరిష్కారం.
- వారంలో మూడు రోజులు అన్ని శాఖల అధికారులతో సమీక్షలు
- సొంత నిధులు రూ.కోటితో రైతులకు మోటార్ల పంపిణీ
- గన్నవరం యువతకు 15వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు
- పునఃప్రారంభానికి సిద్ధంగా ఉన్న దిగ్గజ కంపెనీ అశోక్ లేలాండ్
- మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధే ధ్యేయంగా పారిశ్రామికవేత్తలతో పలు దఫాల చర్చలు.
- ఎకరానికి రూ.16.5 లక్షల పాత ధరకే పారిశ్రామికవేత్తలకు భూకేటాయింపులు
- రెండేళ్లలో మల్లవల్లి పారిశ్రామికవాడకు రానున్న 420 పరిశ్రమలు
- నాయకుడి పేరును పచ్చబొట్లుగా వేయించుకునేంత అభిమానాన్ని సొంతం చేసుకున్న నేత యార్లగడ్డ. 52 మంది యార్లగడ్డ పేరును పచ్చబొట్లుగా వేయించుకున్నారు.
- అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక ఓట్లను సాధించి 9వ స్థానంలో నిలిచిన నేత యార్లగడ్డ వెంకట్రావు
- వరద సమయంలో సొంత నిధులతో రోజుకు లక్షలాది ఆహార ప్యాకెట్లు పంపిణీ చేసిన మానవతావాది
- వరద సమయంలో పశుపోషకులకు దాణా పంపిణి చేసిన రైతు బిడ్డ
- అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ జాతీయ రహదారికి ఇరువైపులా 45000 మీటర్ల మేర బ్యూటిఫికేషన్, గ్రీనరీ పనులకు శ్రీకారం.
- దశాబ్దకాలంగా మురికి కూపాన్ని తలపిస్తున్న గన్నవరం పట్టణానికి చెత్త డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపిన నేత

యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120,129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

ఒరిగిన విద్యుత్ స్తంభాలు నిలబెట్టారు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కంకిపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రొద్దుటూరు శివారు కొణతనపాడు ప్రధాన రహదారి వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగిన సమస్య పరిష్కారమైంది. ఈ నెల 28న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. దీంతో ఆంధ్రజ్యోతి పత్రికకు కొణతనపాడు, యార్లగడ్డ వారిగూడెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



అధిక పాలసేకరణపై దృష్టి పెట్టాలి

● విజయడెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అధిక పాల సేకరణపై దృష్టి పెట్టి పాల సంఘాలను మరింత బలోపేతం చేయాలని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు సిబ్బందికి సూచించారు. బుధవారం హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని 160 మంది పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల కార్యదర్శులకు వేతనాలపై రూ19.90 లక్షలు బోనస్ చెక్కులు చలసాని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో రైతులతో పాటు సంఘ అధ్యక్షులు, సిబ్బంది పరస్పర సహకారంతో సంఘాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. యూనియన్ నుంచి అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలు రైతులకు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పాలసేకరణ పెరిగినపుడే రైతులకు లాభసాటిగా ఉంటుందని ఆదిశగా ప్రతి ఒక్కరు సమిష్టి కృషితో పనిచేయాలని చలసాని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరక్టర్లు పిన్నమనేని లక్ష్మీప్రసాద్, శనగల శివజ్యోతి, జంక్షన్ పాలశీతల కేంద్రం మేనేజర్ మాగంటి హరిబాబు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



బోనస్ చెక్కులు పంపిణీ చేస్తున్న చలసాని ఆంజనేయులు



టీడీపీ కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

పెనమలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలతో పలు ఇబ్బం దులు పడ్డ నియోజకవర్గానికి చెందిన పలువురు వ్యక్తులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, టీడీపీ మండలాధ్యక్షులు కోయ ఆనంద్‌ప్రసాద్, సూదిమళ్ల రవీంద్ర, అంగిరేకుల మురళి, బీజేపీ నాయకులు యేకుల విజయేంద్ర, దోనేపూడి రవికిరణ్, శొంఠి శివరాంప్రసాద్, తుమ్మల రాంకుమార్, కొమ్మినేని శ్రీను, సలాం, మన్నె రాజబాబు, కరిమికొండ సురేష్, మాదు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులకు ఉద్యోగ కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ప్రసాదంపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులైన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన రామారావు అన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి సభ్యుల ఎన్నికల్లో పట్టభద్రులు వారి ఓటును నమోదు చేసుకోవాలని గొడ్డళ్ల చిన రామారావు కోరారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు బుధవారం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో పట్టభద్రుల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ, బీజేపీ, జనసేన బలపరిచిన అభ్యర్థిగా ఆలపాటి రాజా పోటీ చేస్తున్నారని ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. విజయవాడ రూరల్ మండలం నుంచి సుమారు 500 మంది నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొడ తెగులు ఉధృతిని అరికట్టాలి

కంకిపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరి పైరులో పొడ తెగలు ఉధృతి అధికంగా ఉందని దాన్ని అరికట్టేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి. సుధారాణి అన్నారు. దావులూరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు దోమ ఉధృత్తి, పొడతెగులుపై అవగాహన కల్పించారు.

ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి

» జిల్లా ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారుల శుభాకాంక్షలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈ దీపావళి అందరి ఇళ్లల్లోనూ సుఖశాంతులు, ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలకు ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఇంటా ఆనందాల దీపాలు వెలగాలని, దీపావళికి జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. దీపావళి పండుగ అందరి ఇళ్లల్లోనూ నూతన కాంతులు వెదజల్లాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా ప్రజలు, అధికారులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ హితంగా పరిమితి టపాసులను కాలుస్తూ ప్రజలు కుటుంబసభ్యులతో దీపావళి పండుగ జరుపుకోవాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. దీపావళి సందర్భంగా తెలుగు ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, ప్రతిఇంటా ఆనంద కాంతులు విరజిల్లాలని మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ఆకాంక్షించారు. దీపం-2 పథకంతో మహిళలకు ఉచిత సిలెండర్ అందజేయడంతో దీపావళి పండుగ మరింత కాంతివంతమవుతుందని పలువురు నాయకులు పేర్కొన్నారు.


నిరసన తెలియజేస్తున్న ఎస్‌వీఎల్ కళాశాల విద్యార్థినులు

కళాశాల దారిలో మద్యం దుకాణం వద్దు

» ఎస్‌వీఎల్ కళాశాల విద్యార్థుల నిరసన

అవనిగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సంఖ్యాపరంగా అతి పెద్ద కళాశాల అయిన ఎస్‌వి.ఎల్.క్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో లిక్కర్ షాపు ఏర్పాటు చేసేందుకు వస్తున్న ప్రతిపాదనలపై ఆ కళాశాల విద్యార్థినులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అవనిగడ్డ ఎస్‌బిఐ రోడ్డులో లిక్కర్ షాపును ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని, దీని కారణంగా ప్రతినిత్యం దాదాపుగా 2 వేల మంది జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆ షాపు ఎదురుగా రాకపోకలు సాగించాల్సి వస్తుందని, కళాశాలలకు వెళ్లే మహిళలకు మందు బాబుల కారణంగా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉంటాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని కళాశాల దారిలో ఏర్పాటు చేయాలని భావిస్తున్న లిక్కర్ షాపును వేరే చోట ఏర్పాటు చేసుకోవాలని విద్యార్థులు ఈ సందర్భంగా కోరారు. విద్యార్థినుల ఆందోళనకు కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు మద్దతుగా నిలిచారు.


పిల్లలకు స్వీట్లు, టపాసులు పంపిణీ చేస్తున్న అనుమోలు ప్రభాకరరావు

పోరంకి ఎస్టీ కాలనీలో టపాసులు, స్వీట్లు పంపిణీ

పెనమలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోరంకి ప్రభునగర్‌లోని ఎస్టీ కాలనీలో పిల్లలకు టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు ఆధ్వర్యంలో స్వీట్లు, టపాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నుపాటి శ్రీనివాస్, ఆకునూరి సుబ్బారావు, బోడె సురేంద్ర, ఏనుగ శ్రీనివాస్, వినుకొండ రాజా, అంకెం రాజేష్, బొంగరాల అబ్రహాం పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పటిష్టంగా అమలు చేయాలి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ


సమావేశంలో మాట్లాతున్న కలెక్టర్ బాలాజీ పక్కన జేసీ

మచిలీపట్నంటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలుచేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక విధానంలో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా చర్యలు తప్పవన్నారు. రీచ్‌లలో జేసీబీ, పొక్లెయిన్‌లతో ఇసుక తవ్వకాలకు వీలులేదన్నారు. ఇసుకను మాన్యువల్‌గా తవ్వుకుని తీసుకుని వెళ్లాలన్నారు. యంత్రాలను ఉపయోగిస్తే సీజ్ చేస్తామన్నారు. నది కట్టకు ఏవిధమైన హాని జరగకుండా కట్టనుంచి 200 మీటర్ల లోపలే తవ్వుకోవాలన్నారు. ఇందుకు గ్రామ, మండల సర్వేయర్ల సహాయంతో తహసీల్దార్లు మార్కింగ్ చేయాలన్నారు. అవసరమైన మేరకు ఇసుక తీసుకుని వెళ్లాలని, వ్యాపార ధోరణిలో నిల్వ చేయకూడదన్నారు. ఉచిత ఇసుక విధానం అమలుకు ఆర్డీవో, ఎంపీడీవోలతో డివిజన్, మండలస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బందరు ఆర్డీవో కె స్వాతి, ఉయ్యూరు ఆర్డీవో బీఎస్‌హేలా షారెన్, మైన్స్ ఎడి శ్రీనివాసరావు, ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ గంగయ్య, డిపిఓ జె అరుణ, డ్వామా పిడి శివప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు సకాలంలో అందించాలి

నవంబరు ఒకటో తేదీ ఉదయంనుంచి పింఛన్లను సకాలంలో అందించాలని కలెక్టర్ బాలాజీ పేర్కొన్నారు. బుధవారం పింఛన్ల పంపిణీపై వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. 31 నదీపావళి సెలవు దినమైనందున ఒకరోజు ముందుగా డ్రా చేసిన సొమ్మును జాగ్రత్తగా భద్రపరచకోవాలన్నారు. 2,38,249 మంది పింఛను లబ్దిదారులకు రూ.101 కోట్ల 9 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీపీవో అరుణ, పింఛన్ల ఏపీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నెత్తురోడిన రోడ్లు

- పొట్టిపాడు ఫ్లైఓవర్‌పై ఆగివున్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్.. డ్రైవర్ మృతి
- పామర్రులో టిప్పర్ ఢీకొని ఇద్దరు కార్మికుల మృతి

ఉంగుటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై కృష్ణాజిల్లా పొట్టిపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొని మినీ వ్యాన్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఆత్కూరు పీఎస్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం అట్లపాడు గ్రామానికి చెందిన వల్లూరికోట రామచంద్రరావు(41) మంగళవారం రాత్రి మినీవ్యాన్‌లో కొబ్బరిబొండాల లోడ్ వేసుకుని కలవలపల్లి నుంచి విజయవాడకు బయల్దేరాడు. అర్ధరాత్రి 12గంటల సమయంలో పొట్టిపాడు ఫ్లైఓవర్‌బ్రిడ్జిమీదకు చేరుకున్నాడు. ఆసమయంలో తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ రాజా ముత్తు జగన్ తన లారీని అజాగ్రత్తగా పొట్టిపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పార్క్‌చేసి ఎటువంటి సిగ్నల్స్ వేయకుండా వదిలివేశాడు. దగ్గరకు వచ్చేంత వరకు ఆగివున్న లారీని మినీ వ్యాన్ డ్రైవర్ రామచంద్రరావు గమనించకపోవడంతో బ్రేక్‌వేసినా వాహనం కంట్రోల్ కాక నేరుగా లారీ వెనుకభాగాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ క్యాబిన్ పూర్తిగా ధ్వంసంకాగా డ్రైవర్ రామచంద్రరావు క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్యాబిన్‌లో ఇరుక్కున్న క్షతగాత్రుడ్ని స్థానికుల సాయంతో అతికష్టంమీద బయటకు తీసి అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున రామచంద్రరావు మృతి చెందాడు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె వున్నారు. మృతుడి మేనమామ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రమాదానికి కారణమైన తమిళనాడు లారీడ్రైవర్ రాజా ముత్తుజగన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


ఆగిఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్.. మృతి చెందిన డ్రైవర్

ఇద్దరు భవన నిర్మాణ కార్మికుల దుర్మరణం

పామర్రు : బతుకుదెరువు కోసం వచ్చిన ఇరువురు కార్మికులు పామర్రు-విజయవాడ ప్రధాన జాతీయ రహదారిపై కంచర్లవానిపురం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. గుడ్లవల్లేరు మండలం అంగలూరు కొత్తపేటకు చెందిన భవన నిర్మాణ కార్మికులైన సయ్యద్ అబ్దుల్ ఖాదర్ (46), రెహమాన్‌బేగ్ (38)లు జీవనోపాధీకోసం పామర్రు బందరు రోడ్డులో గల రైస్ మిల్లులో పనుల నిమిత్తం బుధవారం వచ్చారు. మూత్ర విసర్జనకు మిల్లు నుంచి బయటకు వచ్చిన వారు రోడ్డు డివైడర్‌ను దాటుతుండగా బందరు వైపు నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టింది. దాంతో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మారణం చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై సీహెచ్ అవినాశ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుడ్లవల్లేరు మండలం అంగలూరు కొత్తపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అవినీతికి పాల్పడితే చట్టపరమైన చర్యలు

- ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుప్రజ

మొగల్రాజపురం, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఉన్నత భావాలతో పనిచేయాలని అవినీతికి పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఇ.సుప్రజ చెప్పారు. అవినీతి నిరోధక శాఖ, స్థానిక కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల సంయుక్తంగా ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్న కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ అనే శీర్షికతో అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వాధికారులకు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగమనేది ఒక బాధ్యతని చెప్పారు. తమ బాధ్యతను నిర్వర్తించగానికి ప్రభుత్వం ప్రజలు చెల్లించే పన్నుల నుంచి జీతభత్యాలు ఇస్తోందన్నారు. అయినా చాలాచోట్ల కొందరు ఉద్యోగులపై ఆరోపణలు వస్తుంటాయని వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా లంచాలివ్వకుండా ఎవరన్నా అడిగితే వెంటనే తమకు టోల్ ఫ్రీ నెంబరు 1064కు లేదా 944044057కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎ. సునీత అధ్యక్షత వహించగా ఇన్‌స్పెక్టర్ జీవీవీ సత్యనారాయణ, ఎంవీఎస్ నాగరాజు, ఇతర ప్రభుత్వాధికారులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుప్రజ

ఆయుర్వేద వైద్యంపై అవగాహన పెంచాలి

ఉంగుటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన వైద్య విధానంలో అంతర్భాగమైన ఆయుర్వేద వైద్యంపై గ్రామీణ ప్రాంత ప్రజల్లో అవగాహన పెంచి, ఔషధ పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా ఆయుర్వేద భగవానుడైన ధన్వంతరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తోందని తేలప్రోలు ఆయుర్వేద ఆసుపత్రి వైద్యులు డాక్టర్ లక్ష్మీ సౌజన్య అన్నారు. తొమ్మిదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తేలప్రోలు ఆయుర్వేద ఆసుపత్రిలో బుధవారం ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, ఆయుర్వేద ఆసుపత్రి సిబ్బంది అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఉయ్యూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధి మండలాల్లోని సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి బుధవారం శిక్షణ నిచ్చారు. ఆర్డీవో కార్యాలయం ఏఓ జి.భద్రునాయక్ ఆధ్వర్యంలో స్థానిక ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్ బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉయ్యూరుతో పాటు మిగిలిన ఆరు మండలాల తహసీల్దార్లు పాల్గొని ఎన్నికల సందర్భంగా పాటించాలిసిన నియమనిబంధనలు సిబ్బందికి వివరించారు.


ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏవో భద్రునాయక్

భూముల రీసర్వే తప్పుల తడక..

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలోని రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నిర్వహించిన రీ సర్వేలో 96శాతం పైగా తప్పులు దొర్లాయని రేమల్లె రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రేమల్లెలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆర్డీవోకు దరఖాస్తు చేసిన ఆర్జీతో కలిపి వినతిపత్రాన్ని సర్వే సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఫణికుమార్, గ్రామసర్వేయర్ అఖిల్, వీఆర్‌వో నాగమణి, యనమదల సుధాకరరావు, కొల్లూరి ప్రభాకర్‌రావు, చల్లగుళ్ల లోకేశ్వరరావు, పర్వతనేని సాంబశివరావు, బాలకృష్ణ, రాజారావు తదితర రైతులు పాల్గొన్నారు.

అందుబాటులోకి రూ.50, రూ.100 స్టాంప్ పేపర్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలకమైన రూ.50, రూ.100 స్టాంప్ పేపర్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని సద్వినియోగం చేసుకోవాలని కానుమోలు సబ్ రిజిస్ట్రార్ జయరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో ఉపయోగించిన ఈ స్టాంపులతో పాటుగా స్టాంప్ పేపర్లను కూడా వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు. ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


ఉప్పలూరులో టీడీపీ సభ్యత్వ నమోదు


శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న గుర్రం

శరవేగంగా టీడీపీ సభ్యత్వ నమోదు

కంకిపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వంతో పార్టీ నాయకులతో పాటు కార్యకర్తలకు ప్రయోజనం ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు, ఉప్పలూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు చలసాని రాధాకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని ఉప్పలూరులో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పడవల మధుసూదనరావు, కొండవీటి శివయ్య, సతీష్, పలపాల రాజేష్, లాం చంద్రరావు, పామర్తి వీరస్వామి, లాం ఇజ్రాయిల్, పల్లపు ప్రసాద్, ఇట్టా ఏసుబాబు, పైడిముక్కల శరత్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వం స్వీకరించిన చలసాని

హనుమాన్‌జంక్షన్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో తీసుకు వెళ్లడానికి కృషి చేస్తున్నటేకట విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 26న రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీకి యువ నాయకత్వం చాలా అవసరమన్నారు. యువత ముందుకు వచ్చి పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఉయ్యూరు : కాటూరుకు చెందిన గుర్రం చంద్రశేఖర్‌రావు లక్ష రూపాయలు చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కలసి లక్షరూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. కాటూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు సోమవారపు వెంకటనారాణ, మండల తెలుగు యువత నాయకుడు కోడె హరీశ్, దొప్పలపూడి ప్రసన్న, అనుమోలు ప్రభాకరరావు, కొండా ప్రవీణ్ తదితరులు చంద్రశేఖర్‌రావుతో ఉన్నారు.

దొండపాటి బాబూరావు సేవలు అభినందనీయం

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్


బాబూరావుకు చెక్కు అందజేసి సత్కరిస్తున్న రవికుమార్

గన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అందరికీ అందుబాటులో ఉంటూ ఉత్తమ పౌరసేవలందించిన దొండపాటి బాబూరావు విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో విలసిల్లాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అభిలాషించారు. గన్నవరంలో బుధవారం గన్నవరం గ్రేడ్‌వన్ గ్రంథాలయ అధ్యక్షుడు నర్రా సీతారామారావు అధ్యక్షతన నిర్వహించిన బాబూరావు పదవీ విరమణ సభలో ఆయన పాల్గొని చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివయ్య, ఎంఈవో రవికుమార్, ఎంపీడీవో స్వర్ణలత, రోటరీ మాజీ అధ్యక్షులు జాస్తి విజయభూషణ్ కుమార్, గన్నే వెంకట్రావు, పొలిమెట్ల జయరాజు, చిమట రామారావు, కె.నాగరాజు, కేఎస్ జగదీశ్వరరావు, చౌటపల్లి సురేష్, ఎంపీటీసీ సభ్యుడు రంగారావు, బీ విజయకుమార్ తదితరులు పాల్గొని బాబూరావు, మరియమ్మ దంపతులను సత్కరించారు.



నడకుదురులోని శ్రీపృథ్వీశ్వరస్వామి ఆలయం

నరకోత్తారక క్షేత్రం నడకుదురు

నాటి నరకాసుర సంహారం పృథ్వీశ్వర క్షేత్రంలోనే..

(ఆంధ్రజ్యోతి-చల్లపల్లి): నాటి నరకాసురసంహారానికి వేదిక నడకుదురు పృథ్వీశ్వర క్షేత్రం. నరకోత్తారక క్షేత్రంగా భాసిల్లుతున్న నడకుదురు తొలుత నరకొత్తారు, నరకదూరుగా కాలక్రమంలో నడకుదురుగా రూపాంతరం చెందింది. నరకాసురుడిని సంహరించిన శ్రీకృష్ణసత్యభామలు కృష్ణా నదీ తీరాన పిండతర్పణాలు వదిలి, పాటలీవనంలో విశ్రాంతి తీసుకుని శ్రీలక్ష్మీనారాయణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు చారిత్రక కథనం. దేవలోకంలోని పాటలీవృక్షాలు నడకుదురులో మినహా మరెక్కడా లేకపోవటం చారిత్రక ఆధారాలకు నిదర్శనం. స్వయంభువుగా పృథ్వీశ్వరస్వామి ఉద్భవించారు. నడకుదురు క్షేత్ర మహాత్యాన్ని స్కంద పురాణంలోని సహ్యాద్రి ఖండంలో ప్రస్తావించినట్లు పండితులు పేర్కొంటున్నారు. శ్రీకృష్ణుడు సంచరించిండం, కృష్ణానదిలో స్నానమాచరించి పాటలీవనంలో విశ్రాంతి పొందటం అత్యంత పవిత్రమైనదిగా భక్తులు విశ్వసిస్తారు. కార్తీక మాసంలో జిల్లా నలుమూలల నుంచి భక్తులు పృథ్వీశ్వరక్షేత్రానికి వస్తారు. స్వామిని దర్శించుకుని ఉసిరి వనంలో వనసమారాధనలు జరుపుకొంటారు. నాదెళ్లవారిపాలేనికి చెందిన మండవ రవీంద్ర ఐదంతస్థుల రాజగోపురాన్ని నిర్మించి, భారీ నంది విగ్రహాన్ని ఏర్పాటుచేసి దేవతామూర్తులు, పాటలీవనంలో అష్టాదశ శక్తి పీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనా దేవతామూర్తులను ప్రతిష్ఠించడంతో క్షేత్రం నిత్య నూతన శోభతో విరాజిల్లుతోంది.



క్షేత్ర ప్రాంగణంలో మహిమాన్విత పాటలీవృక్షాలు



నరకాసురవధ సందర్భంగా నిప్పు బాణం సంధిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

పృథ్వీశ్వర క్షేత్రంలో నరకాసుర దహనం

చల్లపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పృథ్వీశ్వర క్షేత్రంలో నరక చతుర్దశిని పురస్కరించుకుని నాటి నరకాసుర సంహారాన్ని నేటితరానికి తెలియజేసేలా బుధవారం రాత్రి నరకాసురవధ కార్యక్రమం నిర్వహించారు. నరకాసురుని పోలిన గడ్డి బొమ్మపైకి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నిప్పు వెలిగించిన బాణాన్ని వదిలారు. తొలుత బుద్ధప్రసాద్- విజయలక్ష్మి దంపతులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వేదపండితులు కంఠంరాజు సాయి దీక్షితులు నేతృత్వంలోని పురోహిత బృందం ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు.



బండి రామకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

బండి రామకృష్ణ సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ రాజకీయ రంగంలోనే కాకుండా హోటల్, విద్య, సేవా రంగాల్లో ప్రజలకందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బండి రామకృష్ణ షష్టి పూర్తి మహోత్సవాల సందర్భంగా బుధవారం ఉచిత వైద్య సేవా శిబిరాన్ని మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కారణంగా టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్రకు మద్దతు ఇచ్చారని, భవిష్యత్తులో బండి రామకృష్ణకు భవిష్యత్తులో మంచి పదవి లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పలు డివిజన్లలో, గ్రామాల్లో కేక్‌లు కట్ చేశారు. పేదలకు వస్త్ర, అన్నదానాలు చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నాయకులు మాదివాడ రాము, గడ్డం రాజు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అందరి ఇళ్లల్లో సుఖశాంతులు, వెలుగులు నింపాలని వారు వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. పర్యావరణ హితంగా టపాసులను కాలుస్తూ ప్రజలు కుటుంబసభ్యులతో పండుగ జరుపుకోవాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు సూచించారు. ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ఆకాంక్షించారు.

ఉచిత ఇసుక పటిష్టంగా అమలు చేయాలి

● అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలుచేయాలని అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రీచ్‌లలో జేసీబీలు, ప్రొక్లెయిన్లతో ఇసుక తవ్వకాలకు వీలులేదన్నారు. ఇసుకను తవ్వకుని మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు. యంత్రాలను ఉపయోగిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.



ఉచిత ఇసుక విధానంపై మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

నది కట్ట నుంచి 200 మీటర్ల లోపల తవ్వకోవాలన్నారు. గ్రామ, మండల సర్వేయర్ల సహాయంతో తహసీల్దార్లు మార్కింగ్ చేయాలన్నారు. అవసరమైన మేరకు ఇసుక తీసుకుని వెళ్లాలని, వ్యాపార ధోరణిలో నిల్వ చేయకూడదని సూచించారు. ఉచిత ఇసుక విధానం అమలుకు ఆర్డీవో, ఎంపీడీవోలతో డివిజన్, మండల టాస్క్‌ఫోర్సును అమలు చేయాలన్నారు. బందరు ఆర్డీవో కె.స్వాతి, ఉయ్యూరు ఆర్డీవో బీఎస్‌హేలా షారెన్, మైన్స్ ఏడీ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్ఈ గంగయ్య, డీపీవో జె.అరుణ, డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

రేపు ఉదయాన్నే పింఛన్లు అందించాలి

● అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం

పింఛనుదారులందరికీ శుక్రవారం ఉదయం నుంచి పింఛన్లను అందించాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. బుధవారం పింఛన్ల పంపిణీపై వివిధ శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. 31న దీపావళి సెలవు.. ఒక రోజు ముందుగా డ్రా చేసిన సొమ్మును జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని ఆయన సూచించారు. 2,38,249 మంది పింఛనుదారులకు రూ.101 కోట్ల 9 లక్షలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. డీపీవో అరుణ, ఏపీవో సతీష్ పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరు కార్మికుల దుర్మరణం

పామర్రు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం వచ్చిన ఇద్దరు కార్మికులు పామర్రు-విజయవాడ ప్రధాన జాతీయ రహదారిపై కంచర్లవానిపురం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. గుడ్లవల్లేరు మండలం అంగలూరు కొత్తపేటకు చెందిన భవన నిర్మాణ కార్మికులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్(46), రెహమాన్ బేగ్(38)లు జీవనోపాధికోసం పామర్రు బందరు రోడ్డులోని రైస్‌మిల్లులో పనుల నిమిత్తం బుధవారం వచ్చారు. మూత్ర విసర్జనకు మిల్లు నుంచి బయటకు వచ్చిన వారు రోడ్డు డివైడర్‌ను దాటుతుండగా బందరు వైపు నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎస్సై సీహెచ్ అవినాశ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుడ్లవల్లేరు మండలం అంగలూరు కొత్తపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఖాదర్‌కు భార్య ముగ్గురు సంతానం కాగా, బేగ్‌కు భార్య ఒక చిన్నారి ఉన్నారు.



రెండు వేల మంది విద్యార్థులు రాకపోకలు సాగించే చోట దుకాణం వద్దంటూ నిరసన తెలియజేస్తున్న ఎస్వీఎల్ కళాశాల విద్యార్థినులు

కళాశాల దారిలో లిక్కర్ షాపు పెట్టొద్దు

అవనిగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీఎల్ క్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలకు వెళ్లేదారిలో లిక్కర్ షాపు ఏర్పాటు చేయొద్దంటూ ఆ కళాశాల విద్యార్థినులు బుధవారం నిరసన తెలిపారు. ఎస్‌బీఐ రోడ్డులో లిక్కర్ షాపును ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారని, రోజూ 2 వేల మంది జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు షాపు ఎదురుగా రాకపోకలు సాగించే చోట మందుబాబులతో సమస్యలు వస్తాయని, షాపును వేరే చోట ఏర్పాటు చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనకు కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు మద్దతు తెలిపారు.

క్వారీకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు

● చర్యలు తీసుకోండి

ఘంటసాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాపవినాశనం క్వారీలోకి వెళ్లకుండా లంక భూములకు చెందిన దళితవాడ ప్రజలు అడ్డుకుంటున్నారని చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ప్రజలు తహసీల్దార్ బి.విజయప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తాము నిత్యం పశువులను మేపుకోవడానికి, మేకలు, గొర్రెలకు నీరు పెట్టుకోవటానికి కృష్ణానదికి వెళ్తూ, వస్తుంటామని తహసీల్దార్‌కు వివరించారు. క్వారీలోకి వెళ్లే దారిని ప్రొక్లెయినర్‌తో గండికొట్టారని వివరించారు. తక్షణమే క్వారీ లోకి వెళ్లేలా దారి సౌకర్యం కల్పించాలని కోరారు. జి.వెంకట్రామయ్య, బి.హరీష్, రాంబాబు, వెంక ట్రామయ్య, కె.రాంబాబు, జి.గోపీరాజు, ధనుష్, హరి వర్మ, చంద్రం, శ్రీను, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తహసీల్దార్ విజయప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాపవినాశనం గ్రామస్థులు

మునిసిపాలిటీలో ఏసీ, ట్యాంకరు ఏమయ్యాయి?

● పెడన కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

పెడన, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో ఏసీ, ట్యాంకరు అదృశ్యంపై బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను గట్టిగా నిలదీశారు. ఏసీ, ట్యాంకరు ఏమయ్యాయని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ గరికముక్కు చంద్రబాబు ప్రశ్నించారు. ఏసీ ఇప్పుడే కార్యాలయానికి వచ్చిందని అటెండర్ తనకు తెలిపాడని కమిషనర్ తెలిపారు. ఏళ్ల తరబడి కనిపించకుండా పోయిన ట్యాంకరు సంగతేమిటని చంద్రబాబు ప్రశ్నించారు. ట్యాంకరు గుడివాడలో మెకానిక్ షెడ్డులో ఉందని, రిపేరు నిమిత్తం ముందుగానే రూ.40వేలు చెల్లించాలని షెడ్డు నిర్వాహకులు అడిగారని, డబ్బు చెల్లించకపోవడంతో షెడ్డులోనే ఉండిపోయిందని కమిషనర్ తెలిపారు. ఆస్తుల సర్వేకు రూ. 3వేలు, సర్వే సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ. 1500 ఫీజుగా నిర్ణయించడం సరికాదని చంద్రబాబు అన్నారు. ఏసీ మాయమవడంపై అధికారులే బాధ్యత వహించాలని జనసేన కౌన్సిలర్ మట్టా శివపావని స్పష్టం చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా తాను అడిగిన ప్రశ్నకు ఏడు ఏసీలకు ఐదు సమావేశపు హాలులో, రెండు చైర్‌పర్సన్ చాంబర్‌లో ఉన్నట్టు కమిషనర్ సమాధానం చెప్పారని తెలిపారు. చైర్‌పర్సన్ చాంబర్‌లోని రెండు ఏసీలను తనకు ఇప్పుడు చూపించాలని శివపావని పట్టుబట్టారు. ఏసీ అపహరణకు చైర్‌పర్సన్ బాధ్యత వహించాలని శివపావని అనడంతో చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన హయాంలో జరగని ఏసీ దొంగతనానికి తాను బాధ్యురాలిని కాదని చైర్‌పర్సన్ స్పష్టంచేశారు. ఏసీ దొంగతనంపై తగిన విచారణ జరపాలని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని 8,21 వార్డుల కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్‌లు కోరారు. పట్టణంలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉందని శివపావని విమర్శించారు. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అజెండాలోని 17 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ ఎం.గోపాలరావు, టీపీవో సృజనకుమారి, మేనేజర్ ఎం.రాజా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్, ఆర్ఐ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గ్రామీణ వైద్యులు

సీఎం సహాయనిధికి చెక్కు అందజేత

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.1,01,592ల చెక్కును బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అందజేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, సంఘ అధ్యక్షుడు బి.వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

మునిసిపల్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. డీఈవో రామారావుకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకరావు, ప్రధాన కార్యదర్శి జె.లెనిన్‌బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకర్ వినతిపత్రం అందించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టంచేశారు. బుధవారం మోదుమూడిలో ఉపాధి పథకం నిధులు రూ.20 లక్షలతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. సర్పంచ్ బచ్చు బేబీ, ఎంపీపీ తుంగల సుమతి, ఎంపీడీవో మరియాదేవి, గుడివాక శేషుబాబు, విజయలక్ష్మి, కటికల వసంత్, పంచాయతీ రాజ్ డీఈఈ పగడాల సురేష్‌బాబు, ఏఈ బ్రహ్మానంద బాబు, ఉపాధి పథకం ఏపీవో రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రమాకుమారి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

మోపిదేవి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొక్కిలిగడ్డ, కె.కొత్తపాలెం, వెంకటాపురం, బొబ్బర్లంక, మోపిదేవి గ్రామాలకు చెందిన 18 మంది రైతులను ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న పశ్చిమ గోదావరి జిల్లాలో దూబచర్ల, నల్లజర్ల, జగన్నాథపురం గ్రామాలకు క్షేత్రస్థాయి సందర్శనకు తీసుకెళ్లారు. ఉద్యానశాఖాధికారి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పర్యటనలో ఆయిల్‌పామ్ తోటలు, కలెక్షన్ సెంటర్, అంతరపంటలను పరిశీలించారు. పంటల సాగుపై అవగాహన కల్పించారు. అంతర పంటలుగా కోకో, మిరియాలు, దాల్చిన చెక్క, జాజికాయ, కంద, పసుపు సాగు చేయొచ్చని వివరించారు. 100 శాతం రాయితీపై మొక్కలు అందిస్తారని రైతులకు తెలియజేశారు. క్లస్టర్ ఆఫీసర్ రాంప్రసాద్, మేనేజర్ శ్రీనివాస్, జీఎం విజయప్రసాద్ పాల్గొన్నారు.





బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555

సోలార్ విద్యుత్ యూనిట్‌ను సద్వినియోగం చేసుకోండి

అవనిగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటుకు రూ.30 వేల నుంచి 75 వేలకుపైగా సబ్సిడీ లభిస్తుందని, నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. బుధవారం విద్యుత్ అధికారులు రూపొందించిన సూర్యఘర్ ముక్త్ బిజిలీ యోజన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. మండలి వెంకట్రామ్, విద్యుత్ ఈఈ డి.కృష్ణనాయక్, డీవై ఈఈ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏవో వెంకటేశ్వరరావు, ఏఈఈ ఎస్.వి.వి. సత్యనారాయణ, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.



జల్లువారితోటలో బాణాసంచా దుకాణాల వద్ద గుమిగూడిన ప్రజలు

బాణాసంచా దుకాణాల వద్ద సందడి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జల్లువారితోట, మాచవరం మెట్టుల వద్ద ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద బుధవారం భారీగా విక్రయాలు జరిగాయి. నగర ప్రజలతో పాటు చుట్టుపక్కల పల్లెటూళ్ల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. జల్లువారితోటలో 70, మాచవరంమెట్టు వద్ద 70 దుకాణాలు ఏర్పాటు చేశారు.

రత్నకోడు నుంచి ఇరాలి డ్రెయిన్‌కు వేసిన అనధికార తూములు తొలగించండి

రైతు సంఘం నాయకుల డిమాండ్

కోడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈస్ట్ చానల్ 15, 16, 17, 18బీ కాలువల కింద నాలుగేళ్లుగా పొలాల ముంపునకు కారణమవుతున్న రత్నకోడు నుంచి న్యూ ఇరాలి వరకు వేసిన అక్రమ తూములను తొలగించాలని రైతు సంఘ నాయకులు రేపల్లె యోగప్రకాష్, జొన్నలగడ్డ గోపాలరావు బుధవారం డిమాండ్ చేశారు. దివిసీమ ఆధునికీకరణకు విరుద్ధంగా రత్నకోడు డ్రెయిన్ నుంచి న్యూ ఇరాలి డ్రెయిన్‌లోకి ఆక్వా రైతులు ఇరాలి సమీపంలో వేసిన అక్రమ తూముల కారణంగా నాలుగేళ్లుగా వేలాది ఎకరాల్లో పంట నీటమునుగుతుందని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిని అధికారులు గమనించకుండా వదిలివేశారని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ తూతూమంత్రంగా పనులు చేశారని, శాశ్వతంగా తూములు తొల గించలేదని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, డ్రెయినేజీ విభాగం అధికారులు స్పందించి తూములు తొలగించాలని కోరారు.



రత్నకోడు నుంచి న్యూ ఇరాలిలోకి వేసిన తూములు, మాట్లాడుతున్న రైతు నాయకులు



మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించం

- టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కె.శ్రీనివాసరావు

అవనిగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కోడూరు మండల విస్తృతస్థాయి సమావేశం కోడూరు వంతెన సెంటర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కనపర్తి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు విచ్చేశారు. రెవెన్యూ, పోలీసు, ఇతర కార్యాలయాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరిగినా ఐదేళ్లలో తప్పుడు కేసులు బనాయించి రౌడీషీట్లు తెరిచినా వాటి వివరాలు వెంటనే తమకు తెలియజేయాలని, పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణం ఇంతవరకు పూర్తి కాలేదని, మండలంలో 4వేల ఎకరాలు ముంపునకు గురై రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించాలని, ముంపునకు ప్రధాన కారణమైన అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు నిర్మించేలా చూడాలని కనపర్తిని బండే శ్రీనివాసరావు కోరారు. కోడూరు ఒకటో వార్డులో డ్రెయినేజీ సమస్యపై పలువురు మహిళలు కనపర్తి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వెలివోలు ఇసుక రీచ్ ప్రారంభించాలి

- తహసీల్దార్ వనజాక్షిని కోరిన కనపర్తి శ్రీనివాసరావు

చల్లపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదలు, గృహ నిర్మాణ దారులకు మండలంలో ఉచిత ఇసుకను అందు బాటులోకి తేవాలని టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు కోరారు. తహసీల్దార్ డి.వనజాక్షిని బుధవారం కలిసిన ఆయన మండలంలో ఇసుక లభ్యతపై చర్చించారు. వెలివోలులో ఇసుక రీచ్‌ను ప్రారంభించి ఉచిత ఇసుకను ప్రజలకు అందేలా చూడాలన్నారు. గతంలో వెలివోలు పరిధిలో క్వారీ నిర్వహించారని, ఎంతోమంది కూలీలకు ఉపాధి దొరికిందని తెలిపారు. ప్రజలకు ఇసుక లోడింగ్, రవాణా ఖర్చులతో తక్కువ ధరకే లభించిందన్నారు. ప్రభుత్వం దృష్టికి ఇసుక రీచ్ అంశాన్ని తీసుకెళతామన్నారు. టీడీపీ చల్లపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయ రాధిక పాల్గొన్నారు.

రేషన్ షాపుల ఆకస్మిక తనిఖీ

నాగాయలంక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ విజిలెన్స్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలోని ముగ్గురు సభ్యుల బృందం నాగాయలంకలో మంగళవారం రాత్రి రేషన్ షాపులను ఆకస్మిక తనిఖీచేశారు. నాగాయలంకలోని 3వ నెంబర్ రేషన్ షాపును తనిఖీ చేయగా, 350 కిలోల బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. డీలర్ పూజితపై కేసు నమోదు చేసినట్లు పీడీఎస్ డీటీ జె.కాశీంబాబు తెలిపారు.

6లోపు ఓటు నమోదు చేసుకోండి

- పట్టభద్రులకు తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ సూచన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టభద్రులందరూ నవంబరు 6 వతేదీలోగా తమ ఓటును నమోదు చేసుకోవాలని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ సూచించారు. బందరు మండలం కానూరులో బుధవారం పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నగరంలో పలు డివిజన్లలోనూ పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన నేతలు నిర్వహించారు.

నాగాయలంక సెంటర్‌లో..

నాగాయలంక: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునేందుకు పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత కోరారు. బుధవారం నాగాయలంక సెంటర్‌లో మండల కూటమి నాయకుల ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిబంధనలు పాటించాలి

- టపాసుల విక్రయదారులకు ఎస్సై ప్రతాప్‌రెడ్డి సూచన

ఘంటసాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టపాసులు విక్రయించేటప్పుడు నిబంధనలు పాటించాలని విక్రయదారులకు ఎస్సై ప్రతాప్ రెడ్డి సూచించారు. ఘంటసాలలో రెండు, దాలిపర్రులో ఒకటి శ్రీకాకుళంలో ఒక షాపులో విక్రయాలకు అనుమతి ఇచ్చినట్టు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



నగర వరం

రా.. రమ్మంటూ ప్రకృతి ప్రేమికులను పిలుస్తోన్న 'నగర వనం'

● పచ్చదనం పరుచుకున్న ప్రకృతి సౌందర్యం ● ఆకర్షిస్తున్న ఓపెన్ జిమ్, వాకింగ్, జాగింగ్ ట్రాక్స్ ● కొత్తూరు తాడేపల్లికి క్యూ కడుతున్న నగరవాసులు

తొలి మంచు కురిసింది... పచ్చదనం పరుచుకుంది. ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని చూసి ఏ ఊటీనో.. కొడైకెనాల్ అనుకోకండి! ఇటీవల కురిసిన వర్షాలకు 'నగరవనం' పచ్చదనాన్ని పరచుకుంది. ప్రస్తుతం చలికాలం ప్రారంభమవటంతో తొలి మంచు తెరలు తెరలుగా పడుతుండగా పచ్చటి సౌందర్యం రా.. రమ్మంటూ ప్రకృతి ప్రేమికులను పిలుస్తోంది. విజయవాడ శివారు కొత్తూరు తాడేపల్లిలోని 'నగరవనం'లోని ప్రకృతి దృశ్యాలు మనల్ని అబ్బుర పరుస్తున్నాయి. కొండ సానువులపై సహజసిద్ధంగా ఏర్పడిన ప్రకృతి సోయగాలతో అలరారుతున్న ప్రాంతం శీతాకాలం ప్రారంభం కావటంతో వాకింగ్, జాగింగ్‌లు చేసే వారితో కళకళలాడుతోంది. ఇక్కడికొస్తున్న పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని దీని అభివృద్ధికి అటవీశాఖ అధికారులు తుదిమెరుగులు దిద్దుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అమరావతి చెంతనే ఉన్న విజయవాడ చుట్టుపక్కల పర్యాటకంగా చెప్పుకునే ప్రదేశాలు పెద్దగా ఏమీ లేవు. భవానీ ద్వీపం, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్, మూలపాడు బటర్ ఫ్లై పార్క్ తర్వాత నగరం వనం మాత్రమే పచ్చటి ప్రకృతి రమణీయ ప్రాంతాలుగా ఉన్నాయి.

స్థానికంగా కాకుండా ఒక రాష్ట్ర రాజధాని స్థాయిలో ఇలాంటి ప్రకృతి రమణీయ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా పర్యాటకరంగానికి మేలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం అందుకు తగిన కృషి చేస్తోంది.

పర్యాటక శాఖ నుంచి తప్పించి..

రాష్ట్ర ప్రభుత్వం నూతన పర్యాటక పాలసీలకు శ్రీకారం చుడుతున్న తరుణంలో ఇలాంటి ప్రాంతాలను అటవీశాఖ పర్యవేక్షణ నుంచి తప్పించటం మంచిదన్న వాదనలు వినిపిస్తున్నాయి. నగర వనాన్ని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయటానికి అటవీశాఖ పర్యవేక్షణలో కాకుండా పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు గానీ, సీఆర్‌డీఏ లేదా అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ)ల్లో దేనికైనా ఒకదానికి అప్పగించాలన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఈ సంస్థల ద్వారానే పర్యాటకాభివృద్ధి పరుగులు పెట్టే అవకాశం ఉంది. త్వరితగతిన నిధులు, చక్కటి నిర్వహణ కూడా తోడవుతుంది.

నగరవనం అభివృద్ధికి అడుగులు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దీని అభివృద్ధికి బీజం పడగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని ఐదేళ్లు నిర్లక్ష్యంగా వదిలేయటంతో నగరవనం అభివృద్ధి గాడి తప్పింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నగరవనం అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. అభివృద్ధి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఈ ప్రాంతంలోకి వచ్చి ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. ప్రధానంగా నగర వనంలో దట్టంగా చెట్లు పెనవేసుకుపోయి ఉండటం, వాటి మధ్యన జాగింగ్, వాకింగ్ ట్రాక్‌లు అభివృద్ధితో పర్యాటకులు స్వచ్ఛమైన గాలి వీచే ప్రకృతి నడుమ గడిపే అవకాశం వచ్చింది.

నగర వనంలో ఎన్నెన్నో ప్రత్యేకతలు

కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరం వాతావరణం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఈ పరిస్థితుల్లో ఇక్కడికి వచ్చి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను పీల్చుకోవటం అనేది వెలకట్టలేనిది. దీని కోసం ఎంతో మంది ట్రెక్కర్లు, వాకర్లు పెద్దసంఖ్యలో నగర వనానికి వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఓపెన్ జిమ్‌ను అద్భుతంగా అభివృద్ధి చేశారు. వాకింగ్, జాగింగ్ పూర్తయ్యాక ఓపెన్ జిమ్‌లో ప్రాక్టీసు చేసుకోవచ్చు. వీటన్నింటి తర్వాత కష్టపెట్టిన శరీరానికి కాస్తంత స్వచ్ఛమైన గాలిని







ఆస్వాదించటానికి కొన్ని షెల్టర్స్ ఏర్పాటు చేశారు. రాతి గుహ, బోటు హౌస్ తరహాలో కొన్ని షెల్టర్స్ ఉన్నాయి. ఇక్కడ కూర్చుని ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తుంటే అప్పటి వరకు కష్టించిన శరీరానికి ఉపశమనంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఒంటికి, దీర్ఘకాలిక ఆరోగ్యానికి మంచిది.

జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేయాలి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన వాటిలో గత ఐదేళ్లు సరైన నిర్వహణ లేక వినియోగంలోకి రావటం లేదు. చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలుండటంతో విష సర్పాలు పొంచి ఉన్నాయేమోనని జాగర్లు, వాకర్లు ఆందోళన చెందుతున్నారు. ముందుగా జంగిల్ క్లియరెన్స్‌ను పూర్తిచేయాలి. వనం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించిన నేపథ్యంలో వీటినీ ఆధునీకరించనున్నారు. ఇంకా మరిన్నో ప్రత్యేకతలు సంతరించుకోనున్నాయి. ఈ ప్రాజెక్టు అభివృద్ధికి ఒక మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయాల్సిన అవసరం ఉంది. గత ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతం నిర్మానుష్యంగా మారటంతో సంఘ విద్రోహ శక్తులకు స్థావరంగా మారింది. బీరు సీసాలు, సిగరెట్ పీకలు ఎక్కడ పడితే అక్కడ ఉన్నాయి. ఇటువంటి వాటిని దృష్టిలో పెట్టుకుని నగర వనంలో సెక్యూరిటీని మరింత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆహ్లాదంగా ఉంది.. వాకర్స్

పచ్చని చెట్ల మధ్య వాకింగ్ చేస్తుంటే ఎంతో ఆహ్లాదంగా ఉంటోంది. నగర వాసులకు ఇలాంటి ప్రకృతి వనాలు ఎంతో అవసరం. ఇటీవల కురిసిన వర్షాలకు కొత్త చెట్లతో పచ్చదనం మరింత పెరిగింది. కాకుండా జాగింగ్ చేసేటప్పుడు విష సర్పాలేమైనా ఉంటాయేమోనన్న అనుమానం ఉంది. ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

పిల్లలు ఆడుకోవడానికి బాగుంది

అభివృద్ధి చెందిన నగరాలతో పోలిస్తే మన విజయవాడలో ఇటువంటి పార్కులు లేవు. ఉన్నా అరకొరే. ఈ నగరవనాన్ని కూడా ఇటీవలే తెరిచారు. వాకింగ్, జాకింగ్‌కు ఎంతో అనుకూలంగా ఉంది. ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు ఎన్నో ఉన్నాయి. దీన్ని మరింత అభివృద్ధి చేస్తే సందర్శకుల సంఖ్య మరింత పెరుగుతుంది.



వ్యవసాయ పనిముట్లకు ఎన్యూమరేషన్ చేయించాలి

● ఏపీ రైతు సంఘం

గవర్నర్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు ప్రతినిధుల బృందం బుధవారం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను కలిసి కృష్ణానది, బుడమేరు వరదల్లో నష్టపోయిన కౌలు రైతులు, సన్న, చిన్నకారు రైతుల వ్యవసాయ మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, వ్యవసాయ పరికరాలను ఎన్యుమరేషన్ చేసి నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించింది. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి, సహాయ కార్యదర్శి శివశంకర్, కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.



దుర్గగుడిలో మహాలక్ష్మీయాగం చేస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు

దుర్గగుడిలో మహాలక్ష్మీయాగం

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ధనత్రయోదశి సందర్భంగా దుర్గగుడిలో బుధవారం మహాలక్ష్మీయాగం నిర్వహించారు. వేద పండితులు, అర్చకస్వాములు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మహాలక్ష్మీ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మీ యాగం నిర్వహించారు. పూర్ణాహుతి యాగం ముగిసిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అవినీతికి పాల్పడితే చట్టపరమైన చర్యలు

● ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుప్రజ

మొగల్రాజపురం, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఉన్నత భావాలతో పనిచేయాలని అవినీతికి పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఇ.సుప్రజ చెప్పారు. అవినీతి నిరోధక శాఖ, స్థానిక కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల సంయుక్తంగా ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్న కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ అనే శీర్షికతో అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వాధికారులకు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగమనేది ఒక బాధ్యతని చెప్పారు. తమ బాధ్యతను నిర్వర్తించగానికి ప్రభుత్వం ప్రజలు చెల్లించే పన్నుల నుంచి జీతభత్యాలు ఇస్తోందన్నారు. అయినా చాలా చోట్ల కొందరు ఉద్యోగులపై ఆరోపణలు వస్తుంటాయని వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా లంచాలివ్వకుండా ఎవరన్నా అడిగితే వెంటనే తమకు టోల్ ఫ్రీ నెంబరు 1064కు లేదా 944044057కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎ. సునీత అధ్యక్షత వహించగా ఇన్‌స్పెక్టర్ జీవీవీ సత్యనారాయణ, ఎంవీఎస్ నాగరాజు, ఇతర ప్రభుత్వాధికారులు, పాల్గొన్నారు.

డీఎంఈ ఆఫీస్‌లో షార్ట్ సర్క్యూట్

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. బుధవారం ఉదయం యథావిధిగా విధులకు హాజరైన శానిటేషన్ సిబ్బంది డీఎంఈ చాంబర్‌ను శుభ్రం చేసేందుకు వెళ్లారు. అక్కడ లైట్లు, ఫ్యాన్లతో పాటు ఏసీ ఆన్ చేశారు. మరుక్షణంలోనే మంటలు వ్యాపించాయి. ఏసీ కిందనే సోఫా ఉండడంతో మంటలు సోఫాకు అంటుకుని తద్వారా డీఎంఈ చాంబర్ మొత్తం వ్యాపించాయి. శానిటేషన్ సిబ్బంది ఉన్నతాధికారులతో పాటు ఫైర్ కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. వారు ఆఘమేఘాలపై వచ్చి మంటలను ఆర్పారు. డీఎంఈ చాంబర్ మొత్తం ధ్వంసమైంది. చాంబర్‌లోని ఫర్నిచర్, కంప్యూటర్లు, ప్రింటర్లు పాడయ్యాయి. అయితే డీఎంఈ కార్యాలయం మొత్తం ఈ- ఆఫీస్ విధానం అమలు చేస్తున్నారు కాబట్టి ఎలాంటి ఇబ్బంది లేదని డీఎంఈ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ కె.అప్పారావు తెలిపారు.

డ్వాక్రా సంఘాలకు మరింత చేయూత

● మంత్రి నారాయణ



సభలో ప్రసంగిస్తున్న మంత్రి నారాయణ

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు మరింత చేయూతనిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు. వచ్చే అయిదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు చేసేలా ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు చెప్పారు. బుధవారం మహాత్మాగాంధీ రోడ్డులోని అమరావతి కన్వెన్షన్ హాల్‌లో మెప్మా స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ యాప్‌పై ఒకరోజు శిక్షణ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నారాయణ మాట్లాడుతూ డ్వాక్రా, మెప్మా సంఘాల సభ్యులకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తారని, వారి ఆర్థిక పరిస్థితి బాగుంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుపడుతుందని బలంగా నమ్ముతారన్నారు. ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు చేరువ కావాలంటే డేటా ప్రొఫైలింగ్ అవసరమన్నారు. దీనిద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల డేటా నవంబరుకు పూర్తి అవుతుందని, డిసెంబరు నెలాఖరు నాటికి డేటా బేస్ మొత్తం సిద్ధమవుతుందన్నారు. జనవరి నుంచి సభ్యుల డేటా ప్రకారం ప్రభుత్వం పథకాలు అమలు చేస్తామన్నారు. మెప్మా ఏపీలో 2,78,407 స్వయం సహాయక సంఘాలున్నాయని, మొత్తం సభ్యులు 28,56,651 మంది ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధాని పనులపై అశ్రద్ధ వహించిందని, అప్పట్లో ఇచ్చిన టెండర్లకు కాలపరిమితి పూర్తయిందని, అందుకే టెండర్లను రద్దు చేసి మళ్లీ కేబినేట్ ఆమోదంతో టెండర్లు పిలుస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ అంతా నవంబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు పూర్తయి జనవరి నుంచి రాజధాని పనులు మొదలుపెడతామన్నారు. ఈ వర్క్‌షాపులో మెప్మా ఎండీ తేజ్ భరత్, జిల్లాల పీడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ధర్నాచౌక్: సమాజహితానికి నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పి.నారాయణ తెలిపారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల మంజూరు, వైద్యసేవలు, అర్హులైన వారికి అక్రిడిటేషన్ల మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. తెలుగు జర్నలిస్ట్స్ ఫోరం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో బుధవారం జరిగిన దీపావళి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత ప్రభుత్వం గద్దె దిగడానికి జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఎన్జీవో నేత విద్యాసాగర్, ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యూవీఎస్ రవికుమార్, ప్రధానకార్యదర్శి కోనేరు క్రాంతికుమార్, ఉమ్మడి కృష్ణాజిల్లా మహిళా అధ్యక్షురాలు ఎం.లీలావతి, ఉపాధ్యక్షుడు వై వై వరప్రసాద్, ఎన్జీవో నగరశాఖ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే.. జర్నలిస్టులకు టపాసులు, స్వీట్స్ పంపిణీ చేశారు.

బిడ్డ ప్రాణం పోయింది... నా ప్రాణమైన నిలపండి!

● మైలవరం ప్రభుత్వ వైద్యశాలలో బిడ్డను కోల్పోయిన తల్లి ఆవేదన
● ఆసుపత్రి వద్ద బాధితురాలి బంధువుల ఆందోళన



బాధితురాలితో కలిసి సీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

మైలవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాన్పు కోసం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చింది. కడుపులోనే బిడ్డ చనిపోయాడని వార్త చెప్పారు వైద్యులు. నువ్వయినా బతకాలంటే విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సిందేనని చెప్పడంతో కన్నీళ్లను దిగమింగుకుంది. ప్రైవేటు వైద్యశాలలో కాన్పు చేయించుకునే స్తోమత లేక సర్కారు వైద్యశాలను నమ్మి వచ్చిన ఓ అభాగ్యురాలికి ఎదురైన చేదు అనుభవం ఇది. నా బిడ్డ ప్రాణం తీశారు. కనీసం నా ప్రాణమైనా కాపాడండంటూ కడుపులోనే చనిపోయిన బిడ్డను రెండు చేతులతో పట్టుకొని కన్నీరు మున్నీరుగా రోదిస్తోందా తల్లి. ఈ ఘటన మైలవరంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో బుధవారం జరిగింది. పట్టణానికి చెందిన కట్టా వరలక్ష్మి (25) గర్భవతి. గర్భం దాల్చినప్పటి నుంచి సీహెచ్‌సీలోనే వైద్యం చేయించుకుంటుంది. నెలలు నిండటంతో ఈనెల 29న సాయంత్రం ఆసుపత్రిలో జాయినయ్యింది. బుధవారం నొప్పులు రావడంతో కడుపులోనే బిడ్డ చనిపోయింది. సాయంత్రం 6.30 గంటలకు తల్లికి కూడా సీరియస్ అని విజయవాడ తీసుకెళ్లాలని వైద్యులు బంధువులకు తెలిపారు. దీంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే బిడ్డ చనిపోయిందని, ఉదయం నుంచి ఉంచి సాయంత్రం విజయవాడ వెళ్లమంటున్నారని బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. తాను పూర్తి బాధ్యత తీసుకొని తల్లిని విజయవాడలో చేర్పించి మెరుగైన వైద్యం అందిస్తానని డాక్టర్ జెరీష హామీ ఇవ్వడంతో బంధువులు ఆందోళన విరమించారు.

బీపీ అధికంగా ఉండటం వల్లే: డాక్టర్ జెరీష

తల్లికి బీపీ అధికంగా ఉండటం వల్లే కడుపులో బిడ్డ చనిపోయింది. శస్త్రచికిత్స చేస్తే తల్లి ప్రాణానికి హాని జరుగుతుందనే ఉద్దేశంతోనే విజయవాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశాం. నేను వెళ్లి అన్ని చూసుకుంటాను. ఇందులో నా నిర్లక్ష్యం ఏమీ లేదు.

వాహన్ పోర్టల్‌లో సమస్యలు నిజమే!

● నవంబరు నెలాఖరు నాటికి పరిష్కారమౌతుందని భావిస్తున్నాం
● ఆంధ్రజ్యోతితో డీటీసీ మోహన్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



ఆంధ్రజ్యోతి, విజయవాడ: వాహన్ పోర్టల్‌లో సమస్యల కారణంగా వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నవంబరు నెలాఖరులోగా సమస్యలన్నీ పరిష్కారమౌతాయని ఆశిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) మోహన్ చెప్పారు. బుధవారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన 'పరిహాసంగా పరివాహన్' కథనంపై ఆయన స్పందించారు. దేశవ్యాప్తంగా రవాణా సేవలన్నింటినీ ఏకీకృత పోర్టల్‌లో సేవలందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పరివాహన్‌ను తెచ్చామన్నారు. ఈ పోర్టల్‌ను పరీక్షించేందుకు ప్రయోగాత్మకంగా ఎన్టీఆర్ జిల్లాను ఎంపిక చేసిందని, ఇందులో సాఫ్ట్‌వేర్ సమస్యలు చాలానే ఉన్నాయని, దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనన్నారు. ఈ సమస్యలపై ఇప్పటికే రవాణా కమిషనర్ ఈ నెల 29న రాష్ట్రంలోని జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వాహన్ పోర్టల్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను నివేదించాలని ఆదేశించారన్నారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) బృందంతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. పోర్టల్‌ను నవీకరించే వరకు పోర్టల్‌లో జరగని లావాదేవీలు మాన్యువల్‌గా జరిపేందుకు విజ్ఞప్తి చేయగా కమిషనర్ సానుకూలంగా స్పందించారని, దీనిపై రెండు, మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు.

చంద్రబాబుకు ఏఐఎంపీఎల్‌బీ కృతజ్ఞతలు

విజయవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో తిరస్కరించేందుకు సహాయ సహకారాలు ప్రభుత్వం నుంచి ఉంటాయని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబుకి ముస్లిమ్స్ పర్సనల్ లా బోర్డు రాష్ట్ర జనరల్ సెక్రటరీ మౌలానా మహమ్మద్ ఫజ్లులూర్ రహీం కృతజ్ఞతలు తెలిపారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధులు ఈనెల 23న చంద్రబాబును మైనార్టీ మంత్రి ఎండీ ఫరూక్ సమక్షంలో కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. వెనుకబడిన ముస్లింలకు 4శాతం కోటాను మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. సీఎంతో భేటీకి సహకరించిన మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎం.ఫరూక్ షుబ్లితో పాటు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

సామాజిక సేవలో అగ్రగామి రెడ్‌క్రాస్



మాట్లాడుతున్న ఫరిదా

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అత్యవసర సమయాల్లో సేవలందించే సంస్థల్లో రెడ్‌క్రాస్ అగ్రగామిగా కొనసాగుతుందని సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీఈవో ఏకే ఫరిడా అన్నారు. కేబీఎన్ కళాశాల, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో క్లైమేట్ యాక్షన్ అవగాహన సదస్సు కాలేజీ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏకె ఫరిడా మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఒక అంతర్జాతీయ మానవతా ఉద్యమమన్నారు. విద్యార్థులను చైతన్యవంతులను చేసి, తద్వారా ప్రపంచాన్ని అవగాహన పరిచే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. తొలుత రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనంట్‌కు నివాళులర్పించారు. సొసైటీ స్టేట్ కో-ఆర్డినేటర్ బి.వి.ఎస్.కుమార్, హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, పి.ఓలు ఎన్.సాంబశివరావు, బేగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారిగా వెంకటేశ్వర్లు

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ) ప్రాజెక్ట్ ఆఫీసర్ సీబీ హరినాథరెడ్డిని ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్‌గా బదిలీ చేసి, అక్కడున్న ఎం.వెంకటేశ్వర్లును ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. డిప్యూటేషన్‌పై పరస్పరం బదిలీ చేసినట్టు బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

కోకో జోన్ల ఏర్పాటుకు కమిటీ: ఏలూరు జిల్లాలో కోకో రైతులకు మద్దతుగా ఫ్యాక్టరీ జోన్ల కేటాయింపునకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇద్దరు లేదా ముగ్గురు కోకో రైతులు, ఒకరు లేదా ఇద్దరు చొప్పున కోకో ప్రాసెసర్స్, ఆయిల్‌పామ్ ప్రాసెసర్స్, ఉద్యానశాఖ అదనపు సంచాలకులు, ఉద్యాన శాస్త్రవేత్త, జిల్లా ఉద్యాన అధికారితో కమిటీని ఏర్పాటు చేయాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. రాష్ట్రంలో మత్స్యకారులు చేపల వేటకు నమోదు చేసుకున్న మర పడవలకు రాయితీ డీజిల్ సరఫరా కోసం కొత్తగా మరో 10 హెచ్ఎస్‌డీ ఔట్‌లెట్లకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

ఉచిత గ్యాస్‌లో షరతులు తగదు : సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

గుడివాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఉచిత వంట గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించి, ముందుగా నగదు చెల్లిస్తే తిరిగి 48 గంటల్లో చెల్లిస్తామని షరతు విధించడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో కేంద్రప్రభుత్వం రూ.400 ఉన్న సిలిండర్‌కు సబ్సిడీ వేస్తామని మోసం చేసిందని గుర్తు చేశారు. గ్యాస్ ఏజెన్సీ ద్వారా లింకు చేయించుకున్న వారికి ఉచితంగా మూడు సిలిండర్లు యివ్వాలని ఆర్సీపీ డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మురళీకృష్ణా రెడ్డి, ఐద్వా కార్యదర్శి పి.రజిని తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పటిష్టంగా అమలు చేయాలి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ


సమావేశంలో మాట్లాతున్న కలెక్టర్ బాలాజీ పక్కన జేసీ

మచిలీపట్నంటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలుచేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక విధానంలో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా చర్యలు తప్పవన్నారు. రీచ్‌లలో జేసీబీ, పొక్లెయిన్‌లతో ఇసుక తవ్వకాలకు వీలులేదన్నారు. ఇసుకను మాన్యువల్‌గా తవ్వుకుని తీసుకుని వెళ్లాలన్నారు. యంత్రాలను ఉపయోగిస్తే సీజ్ చేస్తామన్నారు. నది కట్టకు ఏవిధమైన హాని జరగకుండా కట్టనుంచి 200 మీటర్ల లోపలే తవ్వుకోవాలన్నారు. ఇందుకు గ్రామ, మండల సర్వేయర్ల సహాయంతో తహసీల్దార్లు మార్కింగ్ చేయాలన్నారు. అవసరమైన మేరకు ఇసుక తీసుకుని వెళ్లాలని, వ్యాపార ధోరణిలో నిల్వ చేయకూడదన్నారు. ఉచిత ఇసుక విధానం అమలుకు ఆర్డీవో, ఎంపీడీవోలతో డివిజన్, మండలస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బందరు ఆర్డీవో కె స్వాతి, ఉయ్యూరు ఆర్డీవో బిఎస్ హేలా షారెన్, మైన్స్ ఎడి శ్రీనివాసరావు, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ గంగయ్య, డిపిఓ జె అరుణ, డ్వామా పిడి శివప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు సకాలంలో అందించాలి

నవంబరు ఒకటో తేదీ ఉదయంనుంచి పింఛన్లను సకాలంలో అందించాలని కలెక్టర్ బాలాజీ పేర్కొన్నారు. బుధవారం పింఛన్ల పంపిణీపై వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫెరెన్సు నిర్వహించారు. 31 నదీపావళి సెలవు దినమైనందున ఒకరోజు ముందుగా డ్రా చేసిన సొమ్మును జాగ్రత్తగా భద్రపరచకోవాలన్నారు. 2,38,249 మంది పింఛను లబ్దిదారులకు రూ.101 కోట్ల 9 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీపీవో అరుణ, పింఛన్ల ఏపీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి

» జిల్లా ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారుల శుభాకాంక్షలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈ దీపావళి అందరి ఇళ్లల్లోనూ సుఖశాంతులు, ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలకు ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఇంటా ఆనందాల దీపాలు వెలగాలని, దీపావళికి జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. దీపావళి పండుగ అందరి ఇళ్లల్లోనూ నూతన కాంతులు వెదజల్లాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా ప్రజలు, అధికారులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ హితంగా పరిమితి టపాసులను కాలుస్తూ ప్రజలు కుటుంబసభ్యులతో దీపావళి పండుగ జరుపుకోవాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. దీపావళి సందర్భంగా తెలుగు ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, ప్రతిఇంటా ఆనంద కాంతులు విరజిల్లాలని మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ఆకాంక్షించారు. దీపం-2 పథకంతో మహిళలకు ఉచిత సిలెండర్ అందజేయడంతో దీపావళి పండుగ మరింత కాంతివంతమవుతుందని పలువురు నాయకులు పేర్కొన్నారు.

ఎంపీడీవో విఠల్‌పాల్‌కు వీడ్కోలు

పమిడిముక్కల, అక్టబరు 30 (ఆంధ్రజ్యోతి) : పమిడిముక్కల ఎంపీడీవో విఠల్‌పాల్‌ను ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా బుధవారం ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ చేస్తున్న విఠల్‌పాల్‌కు కార్యాలయ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కుమార్ రాజా ముఖ్యఅతిథిగా పాల్గొని ఎంపీడీవోగా విఠల్‌పాల్ సేవలను ఈసందర్భంగా కొని యాడారు. ఎమ్మెల్యేతో పాటు ఉద్యోగులు ఆయనను సత్కరించారు. జక్కా శ్రీనివాసరావు, లింగంనేని బాబూరావు పాల్గొన్నారు.



దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలి

» తహసీల్దార్ రవికాంత్


దుకాణాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

పామర్రు, అక్టోబరు 30 ఆంధ్రజ్యోతి : దీపావళి పర్వదినాన్ని ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని తహసీల్దార్ గూడపాటి రవి కాంత్ కోరారు. బుధవారం స్థానిక చల్లపల్లి రోడ్డు, బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలను సీఐ శుభకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రవికాంత్ మాట్లాడుతూ, ప్రతి దుకాణదారుడు నిబంధనలు పాటించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణం వద్ద నీటిడ్రమ్ములు, ఇసుక బస్తాలు అందుబాటులో ఉంచాలన్నారు. పక్కవారికి ఇబ్బందులు లేకుండా దీపావళిని ఆనందంగా జరుపుకోవాలన్నారు. అగ్నిమాపక అధికారి కె.రాంబాబు మాట్లాడుతూ, టపాసులు పేల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షంతో వ్యాపారులు డీలా..

పామర్రు/కూచిపూడి : అకాల వర్షానికి పలుచోట్ల దీపావళి బాణసంచా విక్రయదారులు డీలా పడ్డారు. వర్షం కారణంగా దుకాణాల వద్ద కొనుగోలుదారులు లేక వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. లక్షల్లో ఖర్చు చేసి తెచ్చిన సరుకును కొనేవారు లేక లబోదిబోమంటున్నారు.



మొవ్వ మండలంలో 11 దుకాణాలకు అధికారులు అనుమతులిచ్చారు. కూచిపూడిలో నాలుగు, నిడుమోలులో నాలుగు, మొవ్వ, కోసూరు, కాజలో ఒక్కొక్క దుకాణానికి అనుమతిచ్చారు. బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవటంతో వ్యాపారాలు లేక దుకాణదారులు ఆందోళన చెందుతున్నారు.






నిరసన తెలియజేస్తున్న ఎస్‌వీఎల్ కళాశాల విద్యార్థినులు

కళాశాల దారిలో మద్యం దుకాణం వద్దు

» ఎస్‌వీఎల్ కళాశాల విద్యార్థుల నిరసన

అవనిగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సంఖ్యాపరంగా అతి పెద్ద కళాశాల అయిన ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలకు వెళ్లేదారిలో లిక్కర్ షాపు ఏర్పాటు చేసేందుకు వస్తున్న ప్రతిపాదనలపై ఆ కళాశాల విద్యార్థినులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అవనిగడ్డ ఎస్‌బిఐ రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని, దీని కారణంగా ప్రతినిత్యం దాదాపుగా 2 వేలమంది జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు అటువైపున రాకపోకలు సాగించాల్సి వస్తుందని, కళాశాలలకు వెళ్లే మహిళలకు మందుబాబుల కారణంగా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉంటాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని కళాశాల దారిలో లిక్కర్ షాపును వేరే చోట ఏర్పాటు చేసుకోవాలని విద్యార్థులు ఈ సందర్భంగా కోరారు. విద్యార్థినుల ఆందోళనకు కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు మద్దతుగా నిలిచారు.


తహసీల్దార్ రామకోటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థినులు

విద్యాదీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

గుడివాడ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టణంలోని పలు కళాశాలల విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ధర్నా నిర్వహించారు. డిగ్రీలో స్పెషల్ ఫీజులను రద్దుచేయాలని, జీవో నెం.77ను రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ మెస్‌చార్జీలను రూ.3వేలకు పెంచాలని, డిగ్రీలో హానర్స్ విధానాన్ని రద్దు చేయాలని తహసీల్దార్ రామకోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షులు సలీమ్, గుడివాడ అధ్యక్షులు నరేంద్ర, నాయకులు సాయిరామ్, పవన్, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరు కార్మికుల దుర్మరణం


మృతులు, ప్రమాదానికి కారణమైన టిప్పరు

పామర్రు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బతుకుదెరువు కోసం వచ్చిన ఇరువురు కార్మికులు పామర్రు-విజయవాడ ప్రధాన జాతీయ రహదారిపై కంచర్లవానిపురం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. గుడ్లవల్లేరు మండలం అంగలూరు కొత్తపేటకు చెందిన భవన నిర్మాణ కార్మికులైన సయ్యద్ అబ్దుల్ ఖాదర్ (46), రెహమాన్‌బేగ్ (38)లు జీవనోపాధికోసం పామర్రు బందరు రోడ్డులో గల రైస్ మిల్లులో పనుల నిమిత్తం బుధవారం వచ్చారు. మూత్ర విసర్జనకు మిల్లు నుంచి బయటకు వచ్చిన వారు రోడ్డు డివైడర్‌ను దాటుతుండగా బందరు వైపు నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టింది. దాంతో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మారణం చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై సీహెచ్ అవినాశ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుడ్లవల్లేరు మండలం అంగలూరు కొత్తపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఖాదర్‌కు భార్య ముగ్గురు సంతానం కాగా, బేగ్‌కు భార్య ఒక చిన్నారి ఉన్నారు.

శరవేగంగా టీడీపీ సభ్యత్వ నమోదు

గుడ్లవల్లేరు,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమం శరవేగంగా సాగుతోంది. మండలంలో 4 బృందాలుగా ఏర్పడి ఒక్కొక్కరూ ఒక్కోప్రాంతంలో సభ్యత్వాలు నమోదు చేస్తున్నారు. మూడురోజుల్లో 650 సభ్యత్వాలు నమోదు చేసినట్టు మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి తెలిపారు. బుధవారం గుడ్లవల్లేరులో 150కి పైగా సభ్యత్వాలు నమోదయ్యాయి. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ కార్యకర్త వెంకటేశ్వరరావుకు కొత్త ఐడీ కార్డును అందజేశారు. కార్యక్రమంలో జానీ, పొట్లూరి రవికుమార్, రంగబాబు, పోలవరపు వెంకటరావు, వల్లూరుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.











బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120,129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555





విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

కరాటే చాంపియన్‌షిప్‌కు డా.కెకెఆర్స్ విద్యార్థులు

గుడివాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 24వ తేదీన విజయవాడ పటమట ప్రభుత్వ బాలుర పాఠశాలలో జరిగిన 68వ ఎస్.జి.ఎఫ కరాటే సెలక్షన్స్-2024లో స్థానిక డా.కెకెఆర్స్ గౌతమ్ విద్యార్థులు 14 సంవత్సరాల వ్యక్తిగత కటా విభాగంలో బి.జశ్వంత్, 17 సంవత్సరాల వ్యక్తిగత కటా విభాగంలో టి.హేమంత్, ఆర్ త్రిదార్ధ్, పి.కేశవ కౌషిక్ వర్మలు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. కోచ్ ఎన్.వెంకటేశ్వరరావు, విద్యార్థులను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

వాతావరణ మార్పులతో వరికి తెగుళ్ల భయం

గుడివాడ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పుల వల్ల వరి పైరుకు తెగుళ్లు ఆశించే అవకాశం ఉంటుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి తెలిపారు. బుధవారం రామచంద్రపురం, పెద ఎరుకపాడులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఏడీఏ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాతావరణ మార్పులవల్ల వరిపైరుకు కొన్ని తెగుళ్ల వచ్చే అవకాశాలున్నాయని, ఎప్పటికప్పుడు వరిపైరును పరిశీలించుకోవాలన్నారు. ఎన్‌పిఎస్ఎస్ యాప్ ద్వారా రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సమాచారం అందుతుందని తెలిపారు. ప్రతీ రైతు సమాచారాన్ని క్రోడీకరించుకుని తమకు నచ్చిన విధంగా చూసుకోవాలని తెలిపారు. పొలాన్ని ప్రతీరోజు చూడాలని, పొలంగట్లపై పచ్చగడ్డి వారానికి ఒకసారి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి, వీఏఎస్ ప్రసాద్, ఏఈవో బి.అనూష, వీఏఏ ఇమ్రాన్, రైతులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, తదితరులు

'మానవులందరికి భగవద్గీత' పుస్తకావిష్కరణ

గుడివాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 'మానవులందరికి భగవద్గీత' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ విశిష్ట ధర్మాచార్య కావూరి శ్రీధర్ మాట్లాడుతూ, పుస్తక ముఖ్య ఉద్దేశ్యం శ్రీకృష్ణుని ద్వారా ఉద్భవించిన 701శ్లోకాల భగవద్గీత, ప్రాధాన్యత నేటి విద్యార్థులకు తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో టీటీడీ ఈ పుస్తకాలను ముద్రించిందన్నారు. సుమారు 3000 పుస్తకాలను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన ఉపాధ్యక్షులు శేగు వెంకటరామారావు, ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం విజయసారధి, ఆచార్యులు భవాని, అంజమ్మ, భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.



'కూచిపూడి'లో నూరుశాతం ఉత్తీర్ణత

కూచిపూడి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పొట్టి శ్రీరాములు తెలుగు విద్యాలయం, కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో ఈ ఏడాది జూలై నెలలో జరిగిన కూచిపూడి నాట్య సర్టిఫికెట్ కోర్సులో విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సర్టిఫికెట్ కోర్సులో 27మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 27మంది ఉత్తీర్ణులై నూరుశాతం ఫలితాలు సాధించారు. అలాగే డిప్లొమో కోర్సులో 30మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 28 మంది ఉత్తీర్ణులై 93శాతం ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

విజయవాడ డివిజన్ కమిటీ సభ్యుడిగా యర్రపోతు

గుడివాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా బీజేపీ పట్టణాధ్యక్షుడు యర్రపోతు అర్జున్, నాయకులు రాంప్రసాద్, మామిడాల వెంకట రమణకుమార్ లను భారత రైల్వేశాఖ నియమించింది. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ మేనేజర్ దేవరకొండ రమేష్ గుర్తింపుకార్డులను అందజేశారు.

నూతన పరిశోధనలపై సదస్సు

గుడ్లవల్లేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ ఇన్ క్లినికల్ ట్రయిల్స్ ఇన్ ఇండియా గ్రోత్ ప్రొజెక్షన్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ అంశంపై స్థానిక వీవీబీఎస్ ఫార్మాస్యూటికల్ కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు హర్యానా రాష్ట్రం, గుర్‌గావ్‌కు చెందిన సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ డీజీఎం డాక్టర్ వి.రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు నూతన పరిశోధనలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం రామకృష్ణను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు కో-ఆర్డినేటర్ కుందన, అమీనా బీ.రవీష, ప్రశాంతి, బాలకృష్ణ, సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.